

బౌద్ధ స్థూపం వద్ద యోగాంధ్ర

ఘంటసాల: కృష్ణాజిల్లా ఘంటసాలలోని బౌద్ధ స్థూపం వద్ద ఈ నెల 13న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం స్థానిక అధికారులు పర్యవేక్షించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 511.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.



మహోత్సవాలు ప్రారంభం

గన్నవరం: క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రేమ, దయ, కరుణ వంటి సద్గుణాలతో జీవించిన పునీత ఆంతోని మహోత్సవాలు కేసరపల్లిలో బుధవారం ప్రారంభమయ్యాయి.

వంచనపై ప్రజాగ్రహం

కూటమి ప్రభుత్వ మోసాలపై వెల్లువెత్తిన నిరసన గళం



మిన్నంటిన నినాదం: గన్నవరంలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీల డప్పు కొట్టారు.. సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టారు.. నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 18 వేలు అంటూ మభ్యపెట్టారు.. మెగా డీఎస్సీ, ఏటా లక్షల్లో ఉద్యోగాల భర్తీ, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ మాయచేశారు.. మహిళలకు ఉచిత బస్సు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ అబద్ధాలను వల్లెవేశారు.. సంపద సృష్టిస్తాం, సంక్షేమాన్ని పరవళ్లు తొక్కిస్తామంటూ గొప్పల దరువేశారు.. అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు.. సూపర్ సిక్స్ పథకాలకు పాతర వేసి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట కక్షపూరిత రాజకీయాలకు తెరతీశారు.. ఇసుక, బుసక, మట్టి వంటి సహజ సంపదను దోచుకుంటున్నారు.. కబ్జాలు, వసూళ్ల దందాతో జేబులు నింపుకొంటున్నారు.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల గడప వద్దకే చేర్చిన వలంటీర్లను తొలగించారు.. ఇంటింటికీ నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాల నిర్వాహకులను నిలిపివేసి, లబ్ధిదారులు రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సిన దుస్థితిని తీసుకొచ్చారు.. వీధివీధినా బెల్టుషాపులను ప్రోత్సహిస్తూ మద్యాన్ని పరవళ్లు తొక్కిస్తున్నారు.. ఏడాది పాలనలో ప్రజల సంక్షేమాన్ని విస్మరించారు.. హామీల అమలులో తమకు వెన్నుపోటు పొడిచిన కూటమి ఏడాది పాలనపై ప్రజలు నిరసన గళం వినిపించారు.. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ నాయకులు గురువారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని కూటమి పాలనను దుయ్యబట్టారు.



- నయవంచనకు మారుపేరుగా కూటమి ప్రభుత్వ పాలన
- అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీల అమలుకు దిక్కులేదు
- కూటమి ప్రభుత్వ తీరుపై 'వెన్నుపోటు దినం' పేరుతో వైఎస్సార్ సీపీ పోరాటం
- నిరసనలో వేలాదిగా పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు
- ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని డిమాండ్
- నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్డీఓలు, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేత
- స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వ పాలనపై ఆగ్రహం వ్యక్తంచేసిన ప్రజలు

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతమైంది. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న నయవంచన పాలనకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) నేతృత్వంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో వేలాది సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కూటమి పాలనలో సంక్షేమానికి దూరమైన ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి 'వెన్నుపోటు దినం'లో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల వరకు వైఎస్సార్ సీపీ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. మార్గ మధ్యంలో ఉన్న మహనీయుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. 'ఉచిత పంటల బీమాకు పంగనామం – రైతు భరోసాకు ఎగనామం, 'హామీ గాలికి – మ్యానిఫెస్టో మూలకి', 'బాబు వచ్చాడు – అందరినీ ముంచాడు', 'మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు', 'అమ్మ ఒడి లేదు – ఇంటింటికీ నాన్న బుడ్డి' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. 'చంద్రబాబు పాలన వద్దు – జగన్ పాలనే ముద్దు' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

☛ గన్నవరంలో పార్టీ ఆఫీసు నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు తరలివెళ్లారు. అక్కడ ధర్నా చేసిన అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని), పార్టీ పరిశీలకుడు జెట్టి గురునాథం, పార్టీ నాయకులు గోగుల శివభరత్‌రెడ్డి, నాలుగు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

☛ పామర్రు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నేతృత్వంలో పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు తరలివెళ్లారు. కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి అశోక్‌కుమార్, జొన్నల రామ్మోహన్‌రెడ్డి, కాకర్ల వెంకటేశ్వరరావు, గోగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

☛ అవనిగడ్డ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సింహాద్రి వికాస్, దోవారి విద్యాసాగర్, సింహాద్రి వెంకటేశ్వరరావు, చెన్ను రంగారావు, మద్ది చిన్నా, పార్టీ జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

☛ మచిలీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు లక్ష్మీటాకీస్ సెంటర్ మీదుగా జిల్లా కోర్టు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ సలార్‌దాదా, మేకల సుబ్బన్న, లంకె వెంకటేశ్వరరావు, బందెల థామస్ నోబుల్, బొర్రా విఠల్ తదితరులు పాల్గొన్నారు.

☛ పెడన నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పార్టీ నాయకులు పూనసాని తాతాజీ, ముత్యాల నాగేశ్వరరావు, సంగా మధుసూదనరావు, మైలా రత్నకుమారి, పిన్నింటి మహేష్, కటకం ప్రసాద్, కన్నా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

☛ గుడివాడ నియోజకవర్గంలో పార్టీ నాయకులు సమావేశమై స్థానిక ఆర్డీఓ కార్యాలయానికి తరలి వెళ్లారు. ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు చంద్రశేఖరరెడ్డి, మట్టా జాన్‌విక్టర్, గొర్ల శ్రీను, ఎం.బి.నారాయణరెడ్డి, దుక్కిపాటి శశిభూషణ్ పాల్గొన్నారు.

☛ పెనమలూరు నియోజకవర్గంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి ఆధ్వర్యంలో ఆయాన్ కల్యాణ మండపం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాకీ బాబు, మాదు శ్రీహరి రాణి, రామకృష్ణ, దాసి రవి, కామినేని రమాదేవి, ప్రతివాడ రాఘవరావు, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హామీలన్నీ హుళక్కే.. విజయవాడలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజలు

ఇది దగాకోరు ప్రభుత్వం



అధికారంలోకి రాగానే సంపద సృష్టిస్తానని చెప్పి ఏడాది కాలంలో రూ.1.51 లక్షల కోట్లు అప్పులు చేసిన దగాకోరు ప్రభుత్వమిది. ఎన్నికల వాగ్దానాలు అమలు గురించి ప్రశ్నిస్తే ఖజానా ఖాళీగా ఉందని గాలి కబుర్లు చెబుతున్నారు. సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ విమానాల్లో, హెలికాప్టర్లలో తిరిగేందుకు డబ్బులు ఉంటాయి గానీ పథకాలకు మాత్రం లేవనడం సిగ్గుచేటు. ఒకప్పుడు లోకేష్ దగాకోరు, అవినీతిపరుడని చెప్పిన నోటితోనే చంద్రబాబు 15 ఏళ్లు సీఎంగా కొనసాగాలని చెప్పడం పవన్ దివాళాకోరుతనానికి నిదర్శనం. రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వల్లభనేని వంశీమోహన్‌పై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వ పతనానికి గన్నవరం నాంది పలుకుతుంది. ప్రజల ఆగ్రహావేశాల్లో ఈ ప్రభుత్వం కొట్టుకుపోతుంది.

– పేర్ని నాని, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు. నాడు సొంత మామకు వెన్నుపోటు పొడిచి పార్టీ పగ్గాలను లాక్కున్నారు. గత ఏడాది అబద్ధపు హామీలతో రాష్ట్ర ప్రజలను మరోమారు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చారు. రాజ్యాంగం ద్వారా అమలు కావాల్సిన పాలనను రెడ్ బుక్ పాలనగా కూటమి ప్రభుత్వం మార్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఎన్నికల్లో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్‌తో పాటు 143 వాగ్దానాలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఈ ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయి. పామర్రులో టీడీపీ కార్యాలయానికి వచ్చి వెళ్లాలంటే సామాన్యులు సైతం నగదు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ చిన్న పని కావాలన్నా.. రికమెండేషన్ చేయాలన్నా ముడుపులు చెల్లించాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు.

– కైలే అనిల్‌కుమార్, పామర్రు మాజీ ఎమ్మెల్యే

మహిళా సంక్షేమానికి రిక్తహస్తం



మహిళలను లక్షాధికారులను చేస్తామంటూ నమ్మించారు. బస్సు ప్రయాణం ఉచితమన్నారు. ఒక్కొక్క మహిళకు నెలకు రూ.1500 ఇస్తామంటూ ఊరించారు. పిల్లలు ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం పేరుతో రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి ఏడాది గడిచిపోయింది. ఈ ఏడాది కాలంలో ప్రతి మహిళా కనీసం రూ.50 వేలకు పైగా నష్టపోయింది. మహిళా సంక్షేమానికి కూటమి రిక్తహస్తం చూపించింది.

– ఇందిరా ప్రియదర్శిని, ఉయ్యూరు

సేవలన్నీ నిలిపివేస్తున్నారు



గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ముంగిటకే లభించేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణకు నాంది పలికారు. వలంటీర్ల ద్వారా ప్రజలు కార్యాలయాలకు వెళ్లకుండానే ప్రభుత్వ సేవలు అందేవి. ఎండీయూ వాహనాలతో పేదల ఇళ్ల వద్దే నిత్యావసరాలు అందేవి. ఈ సేవలన్నింటిని చంద్రబాబు ఒక్కొక్కటిగా నిలిపివేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. తగిన గుణపాఠం చెబుతారు.

– కర్రి శ్రీనివాసరావు, పెడన, 15వ వార్డు



వినతి: పెడనలో తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తదితరులు



నిరసన: అవనిగడ్డ వంతెన సెంటర్‌లో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి, పార్టీ నాయకులు, కార్యకర్తలు



జన సందోహం: మచిలీపట్నంలో భారీ ర్యాలీలో పాల్గొన్న పేర్ని కిట్టు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు



వినమ్రంగా: పామర్రులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణపై కళాజాత



పామర్రు: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయవాడ కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఆఫీస్ పర్యవేక్షణలో పామర్రు నాలుగురోడ్ల కూడలి వద్ద పర్యావరణ పరిరక్షణపై అమరావతి కల్చరల్ టీమ్స్, గుడివాడ బిళ్లపాడు కళాకారులు బుధవారం కళాజాత నిర్వహించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్ల వాడకంతో కలిగే అనర్థాలు, ఓజోన్ పొర విశిష్టతపై కళాకారులు అవగాహన కల్పించారు. మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాకారులు ఎడవల్లి వీరయ్య, ఎడవల్లి నాగేంద్ర, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణ లక్ష్యాలు సాధిద్దాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): క్షయ వ్యాధి (టీబీ)కి సంబంధించిన స్థిరమైన లక్ష్యాలను వేగంగా సాధించేందుకు ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను ప్రారంభించినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ క్యాంపైన్ బ్యానర్లు, పోస్టర్లను బుధవారం డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని, టీబీ నివారణ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణిలతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షయపై అవగాహన పెంచడానికి, వ్యాధిని ఎదుర్కోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డాక్టర్ గుణశ్రీ, డీపీసీ దినేష్ పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీల్లో సత్తా



విజయవాడస్పోర్ట్స్: పటమటలోని కోనేరు బసవయ్య చౌదరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కావ్య, లావణ్య, ఉమాదేవి, రహనోమ మరోసారి జాతీయ సెపక్‌తక్రా పోటీల్లో సత్తా చాటారు. పాట్నాలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా జాతీయ పోటీల్లో ఏపీ జట్టుకు ఈ నలుగురు ప్రాతినిధ్యం వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో మెరుగైన క్రీడా నైపుణ్యం ప్రదర్శించి కాంస్య పతకం సాధించారు. ఈ ఏడాది జనవరిలో విజయవాడ వేదికగా జరిగిన స్కూల్ గేమ్స్ జాతీయ పోటీల్లో ఈ బృందం బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు సింహాద్రి రమేష్ వద్ద కొన్నేళ్లుగా ఈ జట్టు కఠోర శిక్షణ తీసుకుంటోంది. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వి.వి.సత్యనారాయణ క్రీడాకారులను అభినందించారు.

ఏటీవీఎంల వినియోగంలో విజయవాడ డివిజన్ ముందంజ




రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): డిజిటల్ టికెటింగ్‌ను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఏటీవీఎంల వినియోగంలో విజయవాడ డివిజన్ ముందంజలో ఉందని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏటీవీఎంల (ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మిషన్) ద్వారా రూ.78 లక్షల ఆదాయం సాధించినట్లు తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా 29 ప్రధాన రైల్వేస్టేషన్లలో 72 ఏటీవీఎం మిషన్‌లు అందుబాటులో ఉండగా, వాటి వినియోగంలో ప్రయాణికులకు సహాయం చేసేందుకు 92 మంది ఫెసిలిటేటర్లను నియమించామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 2,41,51,165 అన్‌రిజర్వ్‌డ్ టికెట్ల విక్రయాల్లో 33 శాతం ఏటీవీఎం మిషన్‌ల ద్వారా రూ.78,19,581 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఏటీవీఎంల వినియోగాన్ని విజయవంతం చేయడంపై ప్రయాణికులు, సిబ్బందిని డీఆర్ఎం అభినందించారు. ఏటీవీఎంల వినియోగంతో ప్రయాణికులు రద్దీ సమయంలో అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం, సీజన్ టికెట్ల కోసం ఎక్కువసేపు క్యూలైన్‌లో వేచి ఉండే అవసరం ఉండదన్నారు. రానున్న రోజుల్లో డివిజన్ వ్యాప్తంగా అన్ని స్టేషన్లలో ఏటీవీఎం మిషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల ఆరు నుంచి జూలై ఆరో తేదీ వరకు జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్లో బుధవారం ఆయన మెగా డీఎస్సీ–2025 పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా పరిధిలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 1,208 పోస్టులకు వివిధ సెషన్ల వారీగా ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరుగుతాయన్నారు. శ్రీ వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (నందమూరు), అయాన్ డిజిటల్ జోన్ ఐడిజెడ్ (కానూరు), వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్ (కానూరు), పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(కానూరు), ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (గంగూరు), గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజ్ (గుడ్లవల్లేరు), శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (కానూరు) కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థుల రాకపోకల నిమిత్తం రవాణా సౌకర్యం కల్పించాలని ఏపీఎస్ ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలో ఏ విధమైన జిరాక్స్ సెంటర్లు తెరవకుండా చూడాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయం చేసుకుంటూ మెగా డీఎస్సీ పరీక్షలు సజావుగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె. రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవనోపాధి అవకాశాల మెరుగునకు కృషి

కలెక్టర్ బాలాజీ



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధి అవకాశాల మెరుగుదలకు కృషి చేయాలని అధికారులను కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో స్వయం సహాయక సంఘాల జీవనోపాధి కార్యాచరణపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీ శక్తి, సీఐఎఫ్, ముద్ర, పీఎంఈజీపీ, ఎంఎస్ఎంఈ వంటి ఎన్నో మంచి పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. అర్హులు వాటిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామానికీ వెళ్లి అర్హులు తగిన వ్యాపారాలు చేసుకునేలా బ్యాంక్ లింక్డ్ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే ఆయా పథకాలకు గుర్తించిన లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా వ్యాపారాలు చేయాలనుకునే మహిళలకు వ్యాపార మెలకువలపై శిక్షణ ఇవ్వాలని, ఉత్పత్తుల విక్రయానికి మార్గాలు చూపాలని, ఆన్‌లైన్ వ్యాపారంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో మహిళ తరఫున ఆమె భర్త లేదా కుమారుడు వ్యాపారం చేసుకునేందుకు ముందుకొచ్చినా పరిగణనలోకి తీసుకొని సహకారం అందించాలన్నారు. చిన్న చిన్న వ్యాపారాలే కాకుండా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ద్వారా పెద్ద పెద్ద వ్యాపారాలు చేయాలనుకునే మహిళలకు అవగాహన కల్పించాలని, వారి ఎదుగుదలతో ఇతరులకు ఉపాధి కల్పించిన వారవుతారని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్.వెంకట్రావు, పశుసంవర్ధక శాఖ అధికారి చినరసింహులు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ షాహిద్ బాబు, మత్స్యశాఖ అధికారి నాగరాజు, పలువురు ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేట యువకులకు జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 22 వ వార్డు కౌన్సిలర్ గొట్టి నాగరాజు కుమారుడు గొట్టి సురేష్, మిట్టగూడెంకు చెందిన గొట్టి ఉపేంద్ర కుమారుడు గొట్టి తరుణ్ జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించారు. పట్టణంలోని ఐ జిమ్‌లో పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ పొందుతూ గత నెల 30 వ తేదీ, ఈ నెల 1 వ తేదీన ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ జూనియర్స్ 93 కేజీల విభాగంలో సురేష్ ద్వితీయ స్థానం(సిల్వర్ మెడల్)ను, తరుణ్ సబ్ జూనియర్స్ 53 కేజీల విభాగంలో తృతీయ స్థానం(బ్రౌన్జ్ మెడల్)ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను వారి నివాసంలో సురేష్, తరుణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య సురేష్, తరుణ్‌లతో పాటు జిమ్ యాజమాన్యం దొడ్డ దినేష్, కోచ్ సూరేపల్లి కొండలను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంగెపు బుజ్జిబాబు, నలజాల రాజు, సైదులు పాల్గొన్నారు.

కారు ఢీకొని కాంట్రాక్టర్ మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో కాంట్రాక్టర్ మృతి చెందిన ఘటన భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నంకు చెందిన పిన్నమనేని బాబూరావు (59) కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 3వ తేదీ సాయంత్రం ఇబ్రహీంపట్నం విజయవాడ ఎన్‌హెచ్ 65 రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాబూరావు స్పృహ తప్పి పడిపోయారు. దీంతో చుట్టుపక్కల వారు ఆయన్ను ప్రైవేటు హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. బాబూరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. బాబూరావు సోదరుడు రాఘవేంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి ఇలాకాలో మద్యం మాఫియా

- అడ్డగోలు అమ్మకాలతో జనం ధనం దోపిడీ
- ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లు దిగుమతి
- బార్‌లు, వైన్‌షాపులతో పాటు బెల్టుషాపుల్లోనూ విక్రయాలు
- మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారులు

మంత్రి ఇలాకాలో మద్యం మాఫియా రెచ్చిపోతోంది. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండటంతో మద్యంమాఫియా పేట్రేగిపోతోంది. మన రాష్ట్రం నుంచి అందుతున్న మద్యం చాలదన్నట్లు పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని దిగుమతి చేసుకుని మరీ అమ్ముకుంటోంది. సామాన్యుడిని మద్యం మత్తులో ముంచి మద్యం మాఫియా, ఎక్సైజ్ అధికారులు కలసి కోట్లు కొల్లగొడుతూ తమ జేబులు నింపుకొంటున్నారు.



కోనేరుసెంటర్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పొరుగు రాష్ట్రాల మద్యం ఏరులై పారుతోంది. మద్యం దందాలో ఆరితేరిన వ్యాపారులు కొందరు ఇతర రాష్ట్రాల నుంచి మద్యాన్ని పెద్దఎత్తున మచిలీపట్నంకు దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని బార్‌లు, వైన్‌షాపుల్లో బహిరంగంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మచిలీపట్నంలో నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. కొన్ని బ్రాండ్లకు సంబంధించి మద్యం ధరలు మన రాష్ట్రంలో కన్నా ఇతర రాష్ట్రాల్లో తక్కువగా ఉంటున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల నుంచి దొడ్డిదారిన సీసాలు దింపుకొని విచ్చలవిడిగా విక్రయాలు జరిపేస్తూ ప్రజా ధనాన్ని దోచేస్తున్నారు.

తిలా పాపం తలా పిడికెడు

బందరు నియోజకవర్గంలో 9 రెస్టారెంట్ అండ్ బార్‌లు, తొమ్మిది వైన్‌షాపులు ఉన్నాయి. ఇటీవల బందరు మండలం సుల్తానగరంలోని ఓ వైన్‌షాపుపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసి ఎన్‌పీడీ బాటిళ్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు విస్తృత ప్రచారం జరిగింది. కానీ అధికారులు అధికార పార్టీ నేతలకు భయపడి అవి వైన్‌షాపునకు సమీపంలోని ఓ బెల్టుషాపులో దొరికినట్లు చిత్రీకరించి కేసు నమోదు చేసి చూపించారు. అందుకు షాపు యజమాని నుంచి ఎక్సైజ్ అధికారులకు భారీగా మామూళ్లు అందినట్లు సమాచారం. మరో ఘటనలో నగరంలోని ఓ జనసేన నాయకుడికి సంబంధించిన బార్‌లో అర్ధరాత్రి అమ్మకాలు జరుగుతుండగా నైట్‌రౌండ్స్‌లో ఉన్న ఓ పోలీసు అధికారి రైడ్ చేసి దాదాపు 250కి పైగా సీసాలను పట్టుకున్నట్లు సమాచారం. అయితే సదరు బార్ యజమాని సంబంధిత పోలీసుస్టేషన్‌కు ఇచ్చే నెలవారీ మామూళ్లను అందరి ఎదుట ఎండగట్టటంతో పాటు జనసేన పార్టీకి చెందిన ఓ పెద్ద నాయకుడితో ఫోన్ చేయించి బాటిళ్లు పట్టుకున్న అధికారిని గజగజలాడించినట్లు తెలుస్తోంది. దీంతో చేసేదిలేక ఆ అధికారి అర్ధరాత్రి అమ్మకాలు జరుపుతున్నట్లు కేసు నమోదుచేసి పట్టుకున్న బాటిళ్లు మొత్తం బార్‌లోకి పంపినట్లు మద్యం వ్యాపారులు చెప్పుకుంటున్నారు. ఈ కేసుకు సంబంధించి సంబంధిత అధికారికి పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ప్రచారం లేకపోలేదు. గత సోమవారం విజయవాడకు చెందిన స్పెషల్ టీంలు మచిలీపట్నంలోని బస్టాండ్ సెంటర్, విజయవాడ రోడ్డులోని బార్‌లపై దాడులు చేసి చివరికి ఏమీ లేవని తేల్చి వెళ్లిపోయినట్లు సమాచారం. అయితే సదరు షాపుల్లోనూ ఎన్‌పీడీ బాటిళ్లను గుర్తించిన అధికారులు పెద్ద మొత్తంలో సంచులు అందుకుని ఆ రెండు బార్‌లకు గుడ్ కాండక్ట్ సర్టిఫికెట్‌లు ఇచ్చి నట్లు తెలుస్తోంది.

ప్రతి నెలా లక్షల్లో ముడుపులు

మచిలీపట్నంలోని మద్యం దుకాణాల్లో జరి గే అక్రమ మద్యం అమ్మకాల వైపు చూడకుండా ఉండేందుకు బందరు సిండి''కేటు''లు సంబంధిత అధికారులకు లక్షల్లో పారితోషికాలు అందజేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఎన్‌పీడీ అమ్మకాలతో పాటు సమయ పాల నతో సంబంధం లేకుండా చేసుకునే వ్యాపారానికి అడ్డురాకుండా ఉండేందుకు ప్రతి నెలా ఎక్సైజ్ శాఖకు ఒక్కో దుకాణం తరఫున రూ.20,000 చొప్పున అన్ని షాపులకు సంబంధించి నెలకు రూ. 3,60,000, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఒక్కో దుకాణం తరఫున రూ.8,000 చొప్పున రూ.1,44, 000, ఇతర సిబ్బందికి రూ.6,000 చొప్పున రూ.1,06,000 ముట్టజెబుతున్నట్లు సిండికేట్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

300కు పైగా బెల్టు షాపులు

బందరు నియోజకవర్గంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల్లో బార్, వైన్‌షాపులతో పాటు దాదాపు 300కు పైగా బెల్టుషాపులు ఉన్నట్లు సమాచారం. సదరు బెల్టుషాపులకు ఎన్‌పీడీ బాటిళ్లను సరఫరా చేసి బెల్టుషాపు నిర్వాహకుల ద్వారా వ్యాపారులు అమ్మిస్తున్నారు. అలా పట్టణంతో పాటు పల్లెల్లోనూ ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం ఏరులై పారుతోంది. ఇదంతా ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

హత్య కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరు గ్రామంలో గత ఏప్రిల్ నెలలో జరిగిన హత్య కేసులో పోలీసులు ప్రధాన నిందతుడిని బుధవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు మహిళా మండలి కాల్వ కట్టపై దేరంగుల పిచ్చయ్య(40) నివసిస్తున్నాడు. అతని భార్య అతనిని వదిలేయటంతో ఇంటి పక్కన ఉండే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 22న తనతో ఉన్న మహిళపై పిచ్చియ్య దాడి చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న మహిళ బంధువు వేల్పుల రమణ అలియాస్ అఖిల్ తనతో పని చేసే బిహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులతో ఆటోలో వచ్చి పిచ్చయ్యపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన పిచ్చయ్యను ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. పోలీసులు ఈ ఘటనపై దాడి కేసు నమోదు చేసి నిందితులకు బెయిల్ ఇచ్చి వదిలేశారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిచ్చయ్య ఏప్రిల్ 25న మృతి చెందాడు. దీంతో పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. ఈ సమాచారం తెలిసి బెయిల్‌లో ఉన్న నిందితులు పరారయ్యారు. కేసులో ప్రధాన నిందితుడు అఖిల్ గన్నవరం మండలం చలుపలవారిగూడెంకు చెందిన వాడు కాగా, మిగతా ముగ్గురు బిహార్‌కు చెందిన వారు. గత నెలరోజులకు పైగా పోలీసుల గాలింపులో అఖిల్‌ను పోలీసులు ఎట్టకేలకు బుధవారం అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో ఉన్న బిహార్‌కు చెందిన ముగ్గురి ఆచూకీ మాత్రం తెలియలేదు. ఆ ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

బందోబస్తును పకడ్బందీగా నిర్వర్తించండి

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు





కార్యక్రమానికి హాజరైన అధికారులు, సిబ్బంది

కోనేరుసెంటర్: మసూల బీచ్ ఫెస్టివల్ బందోబస్తును సమర్థంగా, పకడ్బందీగా నిర్వర్తించి పోలీసు ప్రతిష్టను మరింత పెంచాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి బుధవారం ఆయన బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బీచ్ అవుట్ పోస్టు పోలీస్‌స్టేషన్ వద్ద బందోబస్తు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే బీచ్ ఫెస్టివల్ ముగింపు వరకు శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి జనం భారీగా తరలివస్తారని ఈ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ క్రీడా పోటీలకు జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు హాజరవుతారని, వారి రాకపోకలకు, భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ ప్రముఖులు, ఇతర రంగాలలోని ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో వారి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ మళ్లింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామని, ఆ దిశగా బందోబస్తును నిర్వర్తించాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన పాయింట్లలో ఉంటూ నిబద్ధతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లలో ఉన్న సిబ్బంది వచ్చే ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేసేలా చూడాలని, ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వి.వి.నాయుడు, ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని స్వాగత ద్వారంపై ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభం అని ఉన్న దృశ్యం

ఇంతకూ బీచ్ ఫెస్ట్ నేటి నుంచా..రేపటి నుంచా?

మంగినపూడి బీచ్ ఫెస్ట్ ప్రారంభ తేదీని నిర్వాహకులు రెండు విధాలుగా ప్రచారం చేస్తుండటంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. నగరంలోని లక్ష్మీటాకీస్ సెంటర్‌లో బీచ్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారానికి బీచ్‌ఫెస్ట్ ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. అయితే జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విడుదల చేస్తున్న ప్రకటనలు, కరపత్రాల్లో ఈ నెల 5వ తేదీ గురువారం నుంచే ప్రారంభమవుతున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో ఈ కార్యక్రమానికి హాజరవుదాం అనుకునే వారు ప్రారంభ తేదీని నిర్వాహకులు రెండుగా పేర్కొంటుండటంతో గందరగోళ పడుతున్నారు.

–మచిలీపట్నంటౌన్



జిల్లా కలెక్టర్ విడుదల చేసిన కరపత్రంలో ఇలా..

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న పీడీఎస్(రేషన్) బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. విజయవాడ సర్కిల్–2 ఏఎస్‌వో శ్రీనివాసులుకు అందిన పక్కా సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఆయన కృష్ణలంకలోని నెహ్రూనగర్ డొంకరోడ్డులో ఉన్న వ్యాన్‌ను తనిఖీ చేశారు. కృష్ణలంకకు చెందిన వ్యాన్ యజమాని సుబ్బారావును పిలిపించి వ్యాన్‌ను తెరిచి చూడగా అందులో ఒక్కొక్కటి 50 కేజీల చొప్పున 40 బస్తాల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఎక్కడ నుంచి తరలిస్తున్నారని సుబ్బారావును ప్రశ్నించగా కృష్ణలంక, ద్వారకానగర్‌లోని ఒక రేషన్ డిపో నుంచి తరలిస్తున్నట్లు అంగీకరించాడు. వెంటనే వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. వ్యాన్‌ను సీజ్ చేసి రేషన్ డిపో డీలర్ కృష్ణమూర్తి, సుబ్బారావులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



మృతి చెందిన రాజేష్

జి.కొండూరు: బైకుపై వెళ్తూ గేదెను ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గుంటూరు జిల్లా తాడికొండ మండలం దామరపల్లికి చెందిన వీసా రాజేష్(26) గత కొన్నేళ్లుగా తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ క్యాటరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులను చూసేందుకు సొంత గ్రామానికి వెళ్లిన రాజేష్, తిరుగు ప్రయాణంలో మైలవరం వైపు వస్తున్న క్రమంలో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో జి.కొండూరు శివారులోకి రాగానే 30వ నంబరు జాతీయ రహదారిపై గేదెను ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్‌ని జి.కొండూరు పోలీసులు 108 అంబులెన్స్‌లో విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేష్ బుధవారం ఉదయం మృతి చెందాడు.

చీకట్లో గేదె కనిపించక...

రహదారిపై గేదెను భారీ వాహనం ఢీకొట్టడంతో గేదె మృతి చెంది రోడ్డుపై పడి ఉంది. అదే సమయంలో అటుగా బైకుపై వస్తున్న రాజేష్‌కు రోడ్డుపై మృతి చెందిన గేదె చీకట్లో కనిపించక ఢీకొట్టి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి వీసా భాస్కరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్ట్

తిరువూరు: సీలేరు నుంచి విజయవాడకు ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తూ ముగ్గురు యువకులు బుధవారం తిరువూరు పోలీసులకు పట్టుబడ్డారు. తిరువూరు మండలం లక్ష్మీపురానికి చెందిన మద్దిరాల లోకేష్, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన వంశీ మరో మైనర్ బాలుడితో కలసి 8 కిలోల గంజాయిని ద్విచక్రవాహనంపై తీసుకు వస్తుండగా, తిరువూరు సమీపంలోని ముత్తగూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణకు పట్టుబడ్డారు. తహసీల్దారు లక్ష్మి సమక్షంలో పంచనామా అనంతరం మైనర్ బాలుడిని విజయవాడలోని జువైనల్ హోంకు తరలించి, ఇరువురు యువకులను అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశించారని చెప్పారు.

విరివిగా మొక్కలు నాటాలి



జ్యూట్‌బ్యాగ్‌లను ఆవిష్కరించిన కలెక్టర్ బాలాజీ, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్లో బుధవారం ఆయన వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం జిల్లా వ్యాప్తంగా 2.92 లక్షల మొక్కలను నాటే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంక్షేమ శాఖ వసతి గృహాల ఆవరణల్లో మొక్కలు నాటాలని సూచించారు. డ్వామా పీడీ ఎన్వీ శివప్రసాద్ యాదవ్, జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ ఇరువురు సమన్వయం చేసుకుంటూ మొక్కలు నాటే ప్రక్రియను చేపట్టాలన్నారు. ప్రస్తుతం జిల్లాలోని పలు మండలాల్లో ఉన్న నర్సరీల నుంచి వివిధ రకాల మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. అవనిగడ్డ మండలంలోని పులిగడ్డ నర్సరీ నుంచి 7 వేల మొక్కలు, పెడన మండలంలోని నందమూరు నర్సరీ నుంచి 40 వేలు, సరుగుడు మొక్కలు 1.5 లక్షలు, గన్నవరం మండలంలోని వీరపనేనిగూడెం నర్సరీ నుంచి 50 వేలు, గూడూరు మండలం గూడూరు నర్సరీ నుంచి 10 వేల మొక్కలు అందిస్తామన్నారు. జూన్ 5వ తేదీ నుంచి జరగనున్న మసుల బీచ్ ఫెస్టివల్ ఉత్సవాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గుడ్డతో తయారు చేసిన సంచులను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా అటవీ శాఖ అధికారి సునీత, బీసీ వెల్ఫేర్ అధికారి రమేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ షాహిద్ బాబు, డీటీడబ్ల్యూఓ ఫణి ధూర్జటి, పశుసంవర్థక శాఖ అధికారి చిన నరసింహులు, మచిలీపట్నం, గుడివాడ, పెడన, ఉయ్యూరు, తాడిగడప మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ శ్రీనివాస టిప్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940

■ M.Tech, B.Tech, MBA, MCA, LLB, BALLB (Online / Regular) Fee : 40K P.A. UGC, AICTE, DEB, BCI Aproved Contact ✆ 91210 57233

■ Prabhas Colleges, VJA: Inter, Degree & P.G. (Arts & Sciences) & B.Ed., Courses Admissions open for 2025-26 Ph: 76709 41483, 99634 72819

Real Estate

PLOT FOR SALE

■ విజయవాడకి 34km అమరావతికి 15km ఔటర్ రింగ్ రోడ్డుకి 1km దూరంలో మా వెంచర్ నందు గజం ధర 5500 మాత్రమే ✆ 91776 79807

TO-LET

■ విజయవాడ దగ్గర పెనమలూరులో పెనమలూరు హైస్కూల్ దగ్గర 2 BHK ఇండిపెండెంట్ ఇల్లు (6,500/-) అద్దెకు కలదు. 89776 44269, 74164 92534

Services

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ గన్నవరం, పెనుమత్స, గుడివాడలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. వివరాలకు సంప్రదించండి. ✆ 99664 32828

■ బెడ్ బాయ్స్ (M/F), నర్సులు, ఆయాలు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు, అత్యధిక జీతం+వ+భో. ఏజెంట్ కమీషన్ 6 వేలు. ✆ 91608 35559, 78158 35561

■ రామవరప్పాడు పార్క్, అలంకార్ థియేటర్, కానూరు Engg. కాలేజ్ దగ్గర సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం॥ డ్యూటీ. జీతం : 15 వేలు, రూమ్ సౌకర్యం ✆ 93911 11702

■ విజయవాడలో ప్రముఖ హాస్పిటల్ నందు 12 గం॥ డ్యూటీ చేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ (మగవారు) సెక్యూరిటీ గార్డ్స్ కావలెను సంప్ర ✆ 83338 51514

■ చిట్టినగర్ & కేదారేశ్వరపేటలోని ఇంటర్‌నెట్ షాప్‌ల నందు పని చేయుటకు లేడీ కంప్యూటర్ Operators కావలెను. Cell ✆ 98481 73777

■ అర్జెంటుగా విజయవాడ (రూరల్) కేతనకొండ దగ్గర స్కూలులో సెక్యూరిటీ గార్డ్, Q: 10th ఆపైన, 40 సం॥, Exp మరియు ఆయా, హెల్పర్స్, హౌస్ కీపింగ్ స్త్రీలు కావలెను. ✆ 9951387899

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డ్రైవర్స్ కావలెను.జీ: 15 వేలు -40 వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999

■ Enikepadu, Bhavanipuram, మా బ్రాంచ్‌లో డెలివరీబాయ్స్ కావలెను.లోకల్ వారికి ప్రాధాన్యత, బైక్, స్మార్ట్‌ఫోన్ మస్ట్ (No Driveing License) వీక్లీ పేమెంట్స్. 8686242288 / 9059910338

గమనిక

7995092114
9912220547

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
డోర్ నెం. 54-15-18/6, యలమంచిలి కాంప్లెక్స్ (స్టెన్సర్స్) ఎదురుగా, విజయవాడ-520008. ఫోన్: 0866-2468600

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన తేది 24.06.2025 న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 24.06.2025, మ॥ 12.30 గం.ల నుండి మ॥ 2.00 గం.ల వరకు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 24.06.2025, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

కెనరా బ్యాంక్, మధునగర్ బ్రాంచ్ (1620), విజయవాడ. ఫోన్: 8331015690

1. ఋణగ్రహీత(లు): శ్రీమతి ఒరుసు శిరీషా రాణి, తండ్రి: శ్రీరామమూర్తి.
బకాయి మొత్తం: తేదీ 31.05.2025 నాటికి రూ. 26,93,997.29/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఖర్చులు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు :
ఐటమ్ నెం.1: కృష్ణా జిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, కానూరు గ్రామపంచాయితీ, కానూరు గ్రామం, ఆర్.ఎస్ నెం. 27/1 27/2, ప్లాట్ నెం. 3, మొత్తం విస్తీర్ణం 183.33 చ॥గ॥ లేదా 153.28 చ॥మీ॥ స్థలంలో అవిభాజ్యపు వాటా 24.44 చ॥గ॥ లేదా 20.43 చ॥మీ॥. హద్దులు: తూర్పు: బోయిన సుబ్బారావు ఆస్తి, దక్షిణం: తోట సావిత్రి ఆస్తి, పడమర: 30.0 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: భోగాది రంగా రావు ఆస్తి. ఐటమ్ నెం.2: పైన తెలిపిన స్థలంలో APCRDA BPS ఉత్తర్వుల ప్రకారం BPS 2019/KRI/PEN/KAN/13616 తేది. 02.07.2020 ప్రకారం నిర్మించిన గ్రూప్ హౌస్ "శ్రీ విశ్వనాథ్ రెసిడెన్సీ" 3వ అంతస్తులో ప్లింత్ ఏరియా 783.81 చ॥అ॥, ఉమ్మడి ఏరియా 120 చ॥అ॥, పార్కింగ్ ఏరియా 30.0 చ॥అ॥ గల ఫ్లాట్ నెం.302. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: మెట్లు మరియు ఉమ్మడి వరండా, ఉత్తరం: శూన్యాకాశం.

రిజర్వుధర రూ. 18,50,000/-	ధరావత్తు సొమ్ము రూ. 1,85,000/-

కెనరా బ్యాంక్, నాగార్జున నగర్ బ్రాంచ్ (6080), విజయవాడ. ఫోన్: 8333813827

2. ఋణగ్రహీత(లు): శ్రీ తిలక్ భోగినేని, తండ్రి: బి. నరసింహ స్వామి.
బకాయి మొత్తం: 31.05.2025 తేదీ నాటికి రూ. 35,94,684.42/- + తదుపరి వడ్డీ & ఇతర ఖర్చులు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
ఎ-షెడ్యూల్: కృష్ణా జిల్లా, విజయవాడ ఈస్ట్ రిజిస్ట్రార్, కంకిపాడు సబ్-రిజిస్ట్రార్ ఆఫీసు, పెనమలూరు మండలం, పోరంకి గ్రామం, ఆర్. ఎస్ నెం. 405/4 నందు మొత్తం 326.70 చ॥గ॥. హద్దులు: తూర్పు: కోటకూర రాఘవేంద్రరావు & ఇతరుల ఆస్తి-46.9', దక్షిణం: మాగంటి సుభాష్ చంద్రబోస్ ఆస్తి-63.0', పడమర: 45 లింకుల వెడల్పు పంచాయితీ రోడ్డు-44.6", ఉత్తరం: కోనేరు రామచంద్ర చౌదరి ఆస్తి-63.6'. ఈ హద్దులలో 326.70 చ॥గ॥ లేదా 273.153 చ॥మీ॥ స్థలంలో అవిభాజ్యపు ఉమ్మడి వాటా 34.335 చ॥గ॥ లేదా 28.70 చ॥గ॥ స్థలం. బి-షెడ్యూల్: పైన తెలిపిన ఎ-షెడ్యూల్ ఆస్తిలో నిర్మించిన అపార్ట్‌మెంట్ "శ్రీ సాయి నిలయం", 2వ అంతస్తులో 750 అ॥ ప్లింత్ ఏరియా, 100 అ॥ ఉమ్మడి ఏరియా, 70 అ॥ (దక్షిణంవైపు దక్షిణం-పశ్చిమ మూల) కారు పార్కింగ్ ఏరియా కలిగిన ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్-2. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా మరియు మెట్లు, ఉత్తరం:ఈ ఫ్లాటు మరియు ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్.1కి మధ్య ఉమ్మడి గోడ. టైటిల్ హోల్డర్: శ్రీ తిలక్ భోగినేని.

రిజర్వుధర రూ. 23,75,000/-	ధరావత్తు సొమ్ము రూ. 2,37,500/-

కెనరా బ్యాంక్, విజయవాడ మెయిన్ బ్రాంచ్ (13340), విజయవాడ. ఫోన్: 9440905155

3. ఋణగ్రహీత(లు): శ్రీ అప్పలభక్తుల రామ కృష్ణ, తండ్రి: ఎ. పరమానంద శాస్త్రి మరియు షలి శ్రీదేవి, తండ్రి: ముత్తయ్య.
బకాయి మొత్తం: 31.05.2025 తేదీ నాటికి రూ. 38,42,827.17/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఖర్చులు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
ఐటమ్ నెం-1: స్థలం వివరములు: కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, ఇబ్రహీంపట్నం ఎస్ఆర్ఓ, గుంటుపల్లి గ్రామ పంచాయితీ మరియు గ్రామం, నమీప డోర్ నెం. 3-53, సర్వే నెం. 238/1, కలిగిన మొత్తం 4767.4 చ॥గ॥ల లేదా 3986.166 చ॥మీ॥లో అవిభాజ్యపు 47.62 చ॥గ॥ లేదా 39.816 చ॥మీ॥ వాటా విస్తీర్ణం గల భూమి. హద్దులు: తూర్పు: పచ్చిపట్ల చంద్రశేఖర్ కొంత ఆస్తి మరియు రోడ్డు కొంత భాగం, దక్షిణం: మరుపూడి విష్ణువర్ధన్ రావు మరియు ఇతరుల ఆస్తి, పడమర: మరుపూడి సుదర్శన అంజనేయులు మరియు వారి కుమారుల ఆస్తి, ఉత్తరం: మరుపూడి అన్నపూర్ణాదేవి మరియు ఇతరులు ఆస్తి మరియు
ఐటమ్ నెం-2: ఫ్లాట్ వివరములు: పైన తెలిపిన ఐటమ్ నెం. 1 స్థలంలో నిర్మించిన "అంజన గ్రీన్ పార్క్" అపార్ట్‌మెంట్, 1వ అంతస్తులో ప్లింత్ ఏరియా 884 చ॥అ॥, కామన్ ఏరియా 121 చ॥అ॥, 100 చ॥అ॥ కారు పార్కింగ్ ఏరియా గల ఫ్లాట్ నెం. 216. అన్ని ఈజ్‌మెంటరీ హక్కులు, ఉమ్మడి ఏరియాలు మరియు ఉమ్మడి సౌకర్యాలు మరియు మెయింటెనెన్స్ కొరకు చెల్లింపులు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు చెల్లించే రిపేరింగ్ ఛార్జీలు, ఉమ్మడి ఉపయోగ హక్కులతో సహా యావత్తు. హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: ఉమ్మడి వరండా, ఉత్తరం: శూన్యాకాశం.

రిజర్వుధర రూ. 22,25,000/-	ధరావత్తు సొమ్ము రూ. 2,22,500/-

కెనరా బ్యాంక్, కార్ల్‌మార్క్స్ రోడ్డు బ్రాంచ్ (13750), విజయవాడ. ఫోన్: 9493787441

4. ఋణగ్రహీత(లు): M/s. శ్రీ వర్ష ఎంటర్‌ప్రైజెస్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ విజయలక్ష్మి రఘుపతుల.
బకాయి మొత్తం: 31.05.2025 తేదీ నాటికి రూ. 37,68,135.34/- + తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఖర్చులు.
ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
షెడ్యూల్-ఎ: కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం, గుణదల సబ్-రిజిస్ట్రీ, ప్రసాదంపాడు గ్రామపంచాయితీ, ప్రసాదంపాడు గ్రామం, ఆర్.ఎస్. నెం. 75/8 & 75/9, డోర్ నెం. 6-192 మొత్తం విస్తీర్ణం 435.95 చ॥గ॥ లేదా 364.51 చ॥మీ॥ లలో అవిభాజ్యపు మరియు అనిర్దేశపు వాటా 27 చ॥గ॥ లేదా 22.57 చ॥మీ॥ విస్తీర్ణం స్థలం మరియు అందులోని ఇల్లు. హద్దులు:- తూర్పు: 15.0 అ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: మునుమూరి రామకృష్ణ ఆస్తి, పడమర: రామచంద్రరావు ఆస్తి, ఉత్తరం: గూడపల్లి అరుణ ఆస్తి. షెడ్యూల్-బి: పైన తెలిపిన మొత్తం స్థలం నందు నిర్మించిన "సాయి టవర్స్", 1వ అంతస్తులో ప్లింత్ ఏరియా 732 చ॥అ॥ కలిగిన అసంపూర్తిగా నిర్మించిన ఫ్లాట్ నెం. FF-1 అన్ని సౌకర్యాలతో. హద్దులు: తూర్పు: బాల్కనీ, దక్షిణం: ఫ్లాట్ నెం.FF-5 ఆస్తి, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: మెట్లు మరియు ఉమ్మడి వరండా.

రిజర్వుధర రూ. 18,00,000/-	ధరావత్తు సొమ్ము రూ. 1,80,000/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ సంబంధిత బ్రాంచ్ మేనేజర్ గారిని లేదా కెనరా బ్యాంక్, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారి గారిని బ్యాంకు పనివేళలలో సంప్రదించగలరు. ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 03.06.2025, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్